



జగన్నాధానికి జీవితంమీద విరక్తి పుట్టింది!

మనిషికి జీవితంమీద విరక్తి కలగడానికి కారణం... జీవించడవే. గుమస్తాగా ఇరవై ఏళ్ళు జీవించి, ఎనిమిది జీవాలకి జన్మయిచ్చి, మూడుపూటలా వాళ్ళకి ఇన్ని గంజినీళ్ళయినా పోయలేకపోతున్న తన చేతకానితనానికి – దౌర్భాగ్యానికి – తనకే అసహ్యం పుట్టుకొచ్చి, ఆత్మహత్య చేసుకోవాలని గట్టిగా నిశ్చయం చేసుకున్నాడు జగన్నాధం.

ఆ వూరికి చివరగా ఓ చెరువు వుంది. అందరూ దాన్ని "దెయ్యాల చెరువు" అంటారు. ఆర్నెల్లకో శవం అయినా ఆ చెరువులో తేలుతుంటుంది.

"దెయ్యాల చెరువులో" పడి - తన జీవితాన్ని అంతంవేసుకోవాలన్న నిశ్చయానికి వచ్చేడు జగన్నాధం.

అర్థరాత్రి.

రేయి కడుపున పెట్టుకుంటోన్న కాలాన్ని, దూరాన్ని కళ్ళతో కొలుచుకుంటూ... చీకటి గదిలో అటూ-ఇటూ పచార్లు చేస్తున్నాడు జగన్నాధం. ఎక్కడో గడియారం పదకొండు గంటలు కొట్టింది.

జగన్నాధం ఆగి, లాల్చీ ఎముకల గూడుకు తగిలించుకుని ... ఇవతలికి వచ్చేడు సావిట్లో, భార్యా...ఎనమండుగురు పిల్లలూ ... చీకటి మూటల్లా ముడుచుకుని, చింకి చాపలమీదపడి నిద్రపోతున్నారు. ఆర్నెల్లు నిండిన

ఆఖరివాడు...అమ్మ పొత్తిళ్ళలోనించి ఇవతలికి దొర్లి, కాళ్లూ చేతులూ కెళ్ళించుకుంటూ... చిల్లిబుగ్గలతో లాంతరుకేసి చూసుకుంటూ నవ్వుతున్నాడు

జగన్నాధం ఎవరికేసీ చూడటం లేదు. భార్యాబిడ్డల భవిష్యత్తు గురించీ... తను తన్నేయబోతున్న వాళ్ళ నోటి దగ్గిరి రేపటి చారు మెతుకుల గురించీ ఆలోచించటంలేదు. అలా ఆలోచించగల ఏ వ్యక్తీ, ఆత్మహత్య చేసుకోలేడు ...

చప్పుడుకాకుండా ఇవతలికి వచ్చి, వీథి తలుపులు దగ్గిరికి చేరేసి ... గబగబా రోడ్డుదాటి, వూరుదాటి, మట్టిబాట వెంట నడుస్తున్నాడు...

పొద్దుటివరకు కురిసిన వర్షపు నీటితో, చేలన్నీ నిండిపోయి పొట్టలు పోసుకుంటున్న వరిపిట్టలు ... తలలు వాల్చేసి, నీళ్ళలోనించి కన్నీళ్ళు కారుస్తున్నాయి. ఆకాశంలో మబ్బులు మదపు ఏనుగుల గుంపులా పరుగెత్తుతున్నాయి. కాలుతీసి కాలువేస్తుంటే ఎర్రటి నీళ్ళు ముఖంమీదా, బట్టలమీదా చిందిపడుతున్నాయి. బాట పక్కన వున్న పొదల్లోనించి కప్పలూ, కీచురాళ్లూ అరుస్తున్నాయి.

జగన్నాధం చిప్పలవరకూ చిత్తడిలో కూరుకుపోతున్న పాదాలను అతి ప్రయాసతో పైకి లాక్కుంటూ ... ఆయాసపడుతూ... ముందుకు అడుగులు వేస్తున్నాడు. అంత చలిలో, చెమ్మలో అతని నుదుటిమీదినించి చెమట్లు ధారలుగా కారుతున్నాయి.

చెరువు గట్టుమీదికి వచ్చేడు.

చెరువంతా వర్షపునీటితో నిండిపోయి, నీరు గట్టుకి జానెడుదూరంలో కదులుతోంది. రాక్షసి మొసలిలా నోరు తీసుకుని చూస్తోంది, చెరువు.

జగన్నాధం రక్తం చరచరా ఎరువెక్కింది. కళ్ళు - పులిపంజాకి బెత్తెడు దూరంలోవున్న తోడేలు కళ్ళలా మండుతున్నాయి.

భుజంమీదవున్న కండువాతీసి – మొలచుట్టూ గట్టిగా చుట్టుకున్నాడు. ఎప్పుడో చూసిన అమ్మా...నాన్నలనీ, ఎప్పుడూ చూడని భగవంతుణ్ణీ ఆఖరిసారిగా తలచుకున్నాడు. వూపిరి బిగించి - శరీరంలోవున్న శక్తినంతా పాదాల్లోకి కేంద్రీకరించుకుని-

దూకేయబోతున్నాడు.

ఆకాశంలో తళుక్కుమని ఓ మెరుపు. క్షణంలో సగంసేపు, పాదాలకి కొంచెం దూరంలో ... నీళ్ళమీద తేలుతూ పైకి లేచివస్తోన్న రెండు పుల్లల్లాటి ఆకారాలమీద పడింది.

శవం.

బాగా వుబ్బి - అప్పుడే నీటిలోనించి తేలి, పైకి ... వస్తోంది. శవం కళ్ళు భయంకరంగా తెరచుకుని, ఆకాశంలోకి చూస్తున్నాయి. మృత్యువు కబంధ హస్తాల్లో చిక్కుకుని, ఆఖరిక్షణాల్లో...

సహాయంకోసం ఏ దేవతల్ని ప్రార్థించాయో ... ఏ దైవాన్ని రక్షించమని పిలుస్తున్నాయో...రెండు చేతులూ పైకి ఆకాశంలోకి చాచపడివున్నాయి.

ఆ నిశీధిలో...నిప్పుల్లాంటి కళ్లతో జగన్నాథాన్ని కౌగిలిలోకి రమ్మని పిలుస్తున్నట్లు చేతులు చాచుకుంటూ, నీటిమీద తేలుకుంటూ ... జగన్నాథం వేపుకి వస్తోంది శవం...

గట్టు అంచుకు వచ్చిన శవంచెయ్యి- జగన్నాథం పంచెకొనకి తగులుకుంది.

జగన్నాథం గావుకేక పెట్టేడు!

చెరువుగట్టుమీద వున్న రాళ్ళలో నించి క్రిందికి దొర్లిపోయి, లేచి - తుప్పల్లోనించి, బురదలోనించి, నెత్తురు కారుతోన్న శరీరాన్ని సాగదీసుకుంటూ...పరిగెత్తుతున్నాడు. బురదలో పడుతున్నాడు. లేస్తున్నాడు. మృత్యువు తరుముకొస్తుంటే ప్రాణాలు కట్టెలగూడులో పెట్టుకుని...దిగంతాలకేసి పరుగెత్తుతున్నాడు...

జేరవేసివున్న తలుపులు తోసుకుని, భళ్లున లోపలికి వచ్చేసేడు. భార్యా - బిడ్డలూ "కెవ్వు కెవ్వు" మంటూ లేచి కూచున్నారు. పరిగెత్తుకుంటూ వచ్చి - అతన్ని పట్టుకుని - మంచంలో పడుకోబెట్టేరు. ఒళ్ళంతా తడిమి, తడిమి "నాన్నా ... నాన్నా ..." అంటూ "ఏవండీ..." అంటూ బెక్కు బెక్కున ఏడుస్తున్నారు.

ఆ ఏడుపు ... మృత్యువును పారద్రోలుతోన్న సంజీవినీ సంగీతంలా, జీవన మాధుర్యాన్ని తనలో నింపుతోన్న అమృత వర్షిణిలా ... అతనిలో ప్రవహిస్తోంది.

కళ్లు విప్పి - అందర్నీ చేతులతో చుట్టి...దగ్గిరికి తీసుకున్నాడు. ముద్దులు పెట్టుకున్నాడు...!

అందర్నీ గుండెల్లోకి పొదువుకుని... కళ్ళుమూసుకుని...

వాళ్లందరి భవిష్యత్తుకోసం,

కాస్త మంచి భవిష్యత్తుకోసం...

వెలుగుకోసం ఆలోచిస్తున్నాడు ... జగన్నాథం!

